మార్పు కాదు మాయ

రైతు ఆత్మహత్యపై ఆరా

- కాన్గల్‌లో వివరాలు సేకరించిన అధికారులు
- నమస్తే కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

సిద్దిపేట, ఏప్రిల్10 : సిద్దిపేట జిల్లా తొగుట మండలం కాన్గల్ గ్రామంలో రైతు ముచ్చర్ల కొమురయ్య ఆత్మ హత్యపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'మిత్తి కట్టలేక మృత్యుఒడికి' అనే కథనానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ స్పందించారు. బుధవారం కాన్గల్ గ్రామానికి వెళ్లి వ్యవసాయ అధికారులు రైతు వివరాలు సేకరించారు. ముచ్చర్ల కొమురయ్య అనే రైతు పేరుమీద భూమి లేదని, అందుకే రైతుబీమా, రైతుబంధు వర్తింప చేయబడలేదని అధికారులు తెలిపారు. బాధిత రైతు తండ్రి ముచ్చర్ల బాలయ్య పేరు మీద ఎకరా 36 గుంటల భూమి ఉన్నదని.. ఆ భూమికి ప్రతి విడుత రైతుబంధు వస్తున్నదని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి...

బాధ్యులైనవారిని కఠినంగా శిక్షించాలని కోరింది.

ఆంధ్రజ్యోతిపై చర్యలు తీసుకోండి

అసత్య కథనాలను వండివారుస్తూ తమ పార్టీపై అక్కసు వెళ్లగక్కుతున్న ఆంధ్రజ్యోతి పత్రికపై ఎన్నికల ప్రవర్తనా నియావళిని అనుసరించి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. 'ట్యాపింగ్ కేసులో 10 మందికిపైగా బీఆర్ఎస్ నేతలు, విచారణలో రాధాకిషన్‌రావు వెల్లడి' అంటూ తప్పుడు కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతిపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసు ఉన్నతాధికారులెవరూ అధికారికంగా ప్రకటన విడుదల చేయలేదని, కనీసం ప్రెస్‌మీట్ కూడా నిర్వహించలేదని ఉదహరించింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసి, కాంగ్రెస్‌కు లబ్ధిచేకూరేవిధంగా ఆంధ్రజ్యోతి తప్పుడు, అసత్య కథనాన్ని ప్రచురించిందని, ఇది ముమ్మాటికీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం నేరమని పేర్కొన్నది. ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ, పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు, ఎడిటర్ కే శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది.

కాంగ్రెస్ మోసాలు ప్రజలకు అర్థమవుతున్నయ్

- రైతుల కోసం మాట్లాడితే అవాకులు చెవాకులా?
- కేసీఆర్‌ను తిట్టుకుంటూ కాలం వెల్లదీస్తున్నవ్
- మంచి పనులతో మెప్పు పొందాలి
- సీఎం రేవంత్‌కు హరీశ్ హితవు
- మెదక్‌లో ఎగిరేది గులాబీ జెండానేనని వెల్లడి
- రుద్రారంలో బీఆర్ఎస్ ప్రచార రథాలు ప్రారంభం

సంగారెడ్డి జిల్లా రుద్రారంలో బీఆర్ఎస్ ప్రచార రథాలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): మార్పు తీసుకువస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాయలు చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆ పార్టీ మోసాలు ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతున్నాయని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పటం ఖాయమని వ్యాఖ్యానించారు. 'ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసింది నీ తిట్ల కోసమా? కేసీఆర్‌ను తిట్టడం, లీకులు ఇచ్చి పేపర్లలో వార్తలు రాయించటం, ఫేక్ వార్తలు సృష్టించి సోషల్ మీడియాలో పోస్టులు చేయటంతోనే కాలం వెల్లదీస్తున్నవ్. తెలంగాణ తెచ్చి పదేండ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌పై మాట్లాడే భాష ఇదేనా?' అని సీఎం రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గణేశ్‌గడ్డలోని గణపతి ఆలయంలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కోసం ఎన్నికల ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ మాట్లాడుతూ.. రైతులకు రూ.500 బోనస్ చెల్లించాలని కోరితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అవాకులు చవాకులు పేలుతావా? అని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి కంటే తాము ఎక్కువే తిట్టగలమని, సంస్కారం ఉంది కాబట్టి తిట్టడం లేదని అన్నారు. తిట్లు తిట్టడం కాదు, మంచి పనితనంతో ప్రజల మెప్పు పొందాలని సీఎంకు హితవు పలికారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక రాష్ట్రంలో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వాటిని అరికట్టేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అడ్డా

మెదక్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ అడ్డా అని, ఇక్కడ పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరటం ఖాయమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. 2004 నుంచి బీఆర్ఎస్ వరుసగా మెదక్ పార్లమెంట్‌లో విజయకేతనం ఎగురవేస్తూ వస్తున్నదని వెల్లడించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తిరుగులేని మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పరిస్థితి పాలపొంగులా తయారైందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 120 రోజులైనా హామీలు నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500 బోనస్, రైతుభరోసా, కౌలురైతులకు ఆర్థిక సహాయం తదితర హామీలను విస్మరించిందని ధ్వజమెత్తారు. ప్రజలు కేసీఆర్ వెన్నంటే ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఉన్నత విద్యావంతుడు అని, కలెక్టర్‌గా ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 ఏండ్లు పని చేసి ప్రజలకు సేవ చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి ఎంపీ ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. 'బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గుణగణాలు ప్రజలందరికీ తెలుసు. దుబ్బాకలో ఎమ్మెల్యేగా గెలవని బీజేపీ ఎంపీ అభ్యర్థి పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా గెలుస్తారు?' అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు సపాన్‌దేవ్, శంకర్‌యాదవ్, గడీల శ్రీకాంత్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు కొలను రాజాబాల్‌రెడ్డి, తుమ్మల పాండురంగారెడ్డి, లలితాసోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

మోదీ చెప్పినట్టే డమ్మీ అభ్యర్థులు

- బీజేపీకి లాభం చేకూర్చేలా కాంగ్రెస్
- అన్నదమ్ముల్లా రేవంత్, కిషన్‌రెడ్డి
- రాష్ట్రంలో నయవంచన పాలన
- సీఎం రేవంత్‌వి మొసలి కన్నీళ్లు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన, పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ నిలిపిన అభ్యర్థులను చూస్తుంటే 'మోదీ బడే భాయ్.. రేవంత్‌రెడ్డి ఛోటే భాయ్' అనడంలో ఎలాంటి సందేహం లేదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఎంపీ అభ్యర్థులంతా డమ్మీలేనని, ప్రధాని మోదీ చెప్పినట్టే బీజేపీకి లాభం చేకూర్చేందుకే వారిని బరిలో నిలిపారన్న విషయం స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి అన్నదమ్ముల్లా వ్యవహరిస్తున్నారని, కిషన్‌రెడ్డి గెలుపు కోసమే దానం నాగేందర్‌ను ఆయనపై పోటీకి నిలిపారని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్నది ప్రజా పాలన కాదని, నయవంచక పాలన అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ సంపదను ఢిల్లీకి తరలిస్తున్నారని ఆరోపించారు. మొన్నటి వరకు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం చేశారని, నేడు కాంగ్రెస్ అభ్యర్థులను చూస్తుంటే కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని స్పష్టమవుతున్నదని విమర్శించారు. వాటికంటే బీఆర్ఎస్ బలమైనది కావడం వల్లే తమ పార్టీ నేతలను చేర్చుకుని పోటీ చేయిస్తున్నారని ఎద్దేవాచేశారు. తుక్కుగూడలో సభలో రాహుల్‌గాంధీతో పచ్చి అబద్ధాలు మాట్లాడించారని పేర్కొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యోగమూ ఇవ్వని కాంగ్రెస్ తమ హయాంలో ఇచ్చిన 30 వేల ఉద్యోగాలను వారే ఇచ్చినట్టు చెప్పుకోవడం చూస్తుంటే మందికి పుట్టిన బిడ్డను తన బిడ్డే అన్నట్టుందని బాల్క సుమన్ విమర్శించారు. టెట్ ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. పచ్చి అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కర్రు కాల్చి వాతపెట్టాలని పిలుపునిచ్చారు. 25 వేల కోట్లు ఖజానాలో ఉన్నాయని రేవంత్‌రెడ్డి చెప్పారని, ఆ సొమ్ము కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పొంగులేటి కాంట్రాక్టు సంస్థల ఖాతాలోకి వెళ్లిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజు ఏదో ఒక లీకులు ఇస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, నీళ్లు లేక అవస్థలు పడుతుంటే రేవంత్‌రెడ్డి వీటిని పట్టించుకోకుండా అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు, రైతులను పట్టించుకోకుండా కొడంగల్ వెళ్లి మొసలి కన్నీరు కారుస్తున్నారని సుమన్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాంగ్రెస్‌లో మూడు గ్రూపులు

- హస్తం పార్టీలో ఐదుగురు షిండేలు
- సీఎం పదవి కోసం పదిమంది పోటీ
- కాంగ్రెస్‌లో రేవంత్ సొకర్యంగా లేరు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు గాలం
- చిట్‌చాట్‌లో బీజేపీ శాసనసభా పక్షనేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఇప్పుడు ఎల్లో కాంగ్రెస్, గ్రీన్ కాంగ్రెస్, గాంధీ కాంగ్రెస్ అనే మూడు గ్రూపులుగా విడిపోయిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో ఇప్పుడు ఐదుగురు షిండేలు ఉన్నారని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం పదిమంది పోటీ పడుతున్నారని తెలిపారు. రెండోస్థానం కోసం కూడా పోటీ తీవ్రంగా ఉన్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారని, తెరవెనుక కుట్రలు జరుగుతున్నాయని మహబూబ్‌నగర్ సభలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి అలా అనడం ఆయన అసమర్థతకు నిదర్శనమని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డి సొకర్యంగా లేరని, అందుకనే సొంత దుకాణం కోసం ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే తనవెంట ఉన్న ఎమ్మెల్యేలకు తోడుగా బీఆర్ఎస్ నుంచి మరో 25 మంది ఎమ్మెల్యేలను తెచ్చుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. రేవంత్‌కు పోటీగా 25 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని ఉత్తమ్ కామెంట్ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌ను ఎవరూ ఏమీ చేయాల్సిన అవసరం లేదని, నాయకుల మధ్య విభేదాలే పార్టీని బలహీనం చేస్తాయని విమర్శించారు. వాళ్లలో వారే కొట్టుకోవడం ద్వారా ప్రభుత్వం కూలిపోతుందని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమైందని, కాబట్టి ఆయన సోదరుడు వెంకట్‌రెడ్డిని పదవి నుంచి తప్పించి దానిని ఆయనకు ఇస్తారేమోనని అనుమానం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ గేట్లు తెరిచినా, కిటికీలు తెరిచినా బీజేపీ నుంచి ఎవరూ వెళ్లరని తేల్చిచెప్పారు. తాము ప్రజలను నమ్ముకున్నామని, కాబట్టి గేట్లు ఎత్తాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. బీ ట్యాక్స్ అంటే భట్టి ట్యాక్స్ అని కాంగ్రెస్ నేతలే లీకులు ఇస్తున్నారని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

అధికార అహంతో విర్రవీగుతున్న రేవంత్

- సీఎంపై బీజేపీ నేత డీకే అరుణ ఫైర్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 10 : అధికార అహంతో సీఎం రేవంత్‌రెడ్డి విర్రవీగుతున్నాడని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రెండ్రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో తనపై అహంకార పూరితంగా మాట్లాడాడని, ఆయన ఏ స్థాయి నుంచి వచ్చారో గుర్తుచేసుకోవాలని సూచించారు. సీఎం తన భాష మార్చుకోవాలని.. ఎవరు ఎంగిలి మెతుకులకు ఆశపడి వచ్చారో ప్రజలకు తెలుసని ఆమె అన్నారు.

రాహుల్‌కు పంచుతున్నడు!

సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత బాలరాజు ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాధనాన్ని గల్లీలో పేదలకు పంచకుండా ఢిల్లీలో రాహుల్‌గాంధీకి పంచుతున్నారని కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు యాదవ్ విమర్శించారు. రూ.25,000 కోట్లు ప్రభుత్వ ఖజానాలో ఉన్నట్టు చెప్పిన సీఎం.. ఆ సొమ్ము ఎవరి చేతిలోకి వెళ్లిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 83 వేల 500 సీఎంఆర్ఎఫ్ చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దగాకోరు కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి విమానంలో ఢిల్లీకి తిరుగుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో గొర్రెల కోసం కట్టిన డీడీలకు ఇంతవరకు డబ్బులు రిలీజ్ చేయకుండా కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. గొల్లకురుమల వర్గానికి చెందిన బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనిపై గొల్ల కురుమలు, యాదవ సోదరులు ఆలోచన చేయాలని కోరారు. బీసీల వ్యతిరేకిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కడియం కులమేమిటో చెప్పాలి

- అసలైన మాదిగలను మోసం చేస్తున్నారు
- వరంగల్ ఎంపీ టికెట్ మాదిగలకు ఇవ్వాలి
- నాడు విమర్శించిన సీఎం నేడు కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

మషీరాబాద్, ఏప్రిల్ 10 : మాదిగనని చెప్పుకొని ముప్పై ఏండ్లుగా రాజకీయ పబ్బం గడిపిన కడియం శ్రీహరి మాదిగల అవకాశాలకు గండికొట్టి మోసం చేశారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆరోపించారు. బుధవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలుత మాదిగనని, టీఆర్ఎస్‌లో చేరిన తరువాత బైండ్ల కులమని చెబుతూ వచ్చిన కడియం తన వాస్తవ కులమేమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. కడియం తన కులం ఏమిటో శీల పరీక్ష చేసుకోవాలని అన్నారు. ఆయన మాదిగల అవకాశాలను లాక్కొంటున్నారని ఆరోపించిన సీఎం రేవంత్‌రెడ్డి అదే కడియంని కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకున్నారని ప్రశ్నించారు. కడియం పద్మశాలినా, లేక బైండ్లనా ఏ కులం అని నిర్ధారించుకొని పార్టీలో చేర్చుకున్నారో కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలన్నారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మందకృష్ణ మాదిగ కడియం చర్యలను ప్రశ్నిస్తూ మాట్లాడితే వారికి అవగాహన, అర్హత లేదని మాట్లాడుతున్న ఆయన ఏ అర్హతతో మాదిగల గురించి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. తాను ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుడినని చెబుతున్న కడియం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకున్నా ఎందుకు ప్రశ్నించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మతం మారి, వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్న కడియం కావ్యకు మాదిగలు పోటీ చేయాల్సిన వరంగల్ ఎంపీ టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కడియం తన కులం విషయంలో సమాధానం చెప్పకపోతే ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా అడ్డుకొంటామని హెచ్చరించారు. తన బిడ్డకు టికెట్ ఇప్పించుకొని అసలైన మాదిగలకు మోసం, ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వరంగల్ టికెట్ మాదిగలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ టికెట్ల విషయంలోనూ అధిష్ఠానం ఆలోచనను మార్చుకోవాలని, లేనిపక్షంలో గాంధీభవన్, పార్లమెంట్ అభ్యర్థుల ఇండ్ల ముందు చావుడప్పు కొడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెట్టపెంజర రమేశ్, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్‌లో గ్రూపుల పోరు

కడియం శ్రీహరి, కావ్య ముందే భగ్గుమన్న విభేదాలు

జనగామ, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు భగ్గుమన్నది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర సాక్షిగా లింగాలఘనపురం మండలంలో విభేదాలు బయటపడ్డాయి. బుధవారం ఎన్నికల మండలస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. బీఆర్ఎస్‌లో ఉన్న లింగాలఘనపురం జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, మరికొందరు ముఖ్యనేతలు ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలను మరో వర్గం చించేసింది. పార్టీలో చేరికలు జరుగుతుండగానే ఇరువర్గాలు పరస్పరం వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. తీవ్ర అసంతృప్తికి గురైన ఎమ్మెల్యే కడియం, అభ్యర్థి కావ్య మధ్యలోనే వెళ్లిపోయారని సమాచారం.

రాజగోపాల్‌రెడ్డి ఇంటికి రేవంత్

- 'భువనగిరి' బాధ్యత అప్పగింత

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): 'చామలను గెలిపించే బాధ్యత మీరు తీసుకుంటే.. మిమ్మల్ని చూసుకునే బాధ్యతను నేను తీసుకుంటా'నంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు తెలిసింది. మంత్రి పదవి ఆశించి భంగపడిన రాజగోపాల్‌రెడ్డిని బుజ్జగించేందుకు రేవంత్‌రెడ్డి పలుమార్లు ఆయనతో చర్చించి భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాజగోపాల్‌రెడ్డి ఇంట్లో పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, నేతలతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నేతలకు దిశానిర్దేశం చేశారు. అందు లో భాగంగా చామలను గెలిపించే బాధ్యతను కోమటిరెడ్డికి అప్పగించినట్టు తెలిసింది. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 21న కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ వేస్తారని, భువనగిరిలో పార్టీ అభ్యర్థిని రెండులక్షల మెజార్టీతో గెలిపిస్తానని రేవంత్‌కి హామీ ఇచ్చినట్టు చెప్పారు.

మాదిగలను పార్లమెంట్‌లో కూర్చోనివ్వరా?

- మా జాతికి ఒక్క టికెట్టు కూడా ఇవ్వరా?
- కాంగ్రెస్ పార్టీది చారిత్రక తప్పిదం
- రేవంత్‌రెడ్డిలా మాదిగలను దూరం పెట్టిన ముఖ్యమంత్రిని ఇంతవరకు చూడలేదు
- రేవంత్ తప్పు సరిదిద్దుకోవాలి
- కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): 'మాదిగ జాతిని పార్లమెంట్‌లో కూర్చోనివ్వరా? మాకు ఒక్క ఎంపీ టికెట్టు కూడా ఇవ్వారా? ఇది న్యాయమేనా?' అని కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆ పార్టీ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాదిగలకు టికెట్లు ఇస్తే.. కాంగ్రెస్ మాత్రం దూరం పెట్టిందని, ఇది చారిత్రక తప్పిదమని మండిపడ్డారు. బరువెక్కిన హృదయంతో మాట్లాడుతున్నానని, తనకు ఎమ్మెల్యే టికెట్ రాకపోయినా బాధపడలేదని చెప్పారు. రాష్ట్రంలో మూడు ఎంపీ స్థానాలను ఎస్సీలకు రిజర్వ్ చేసినా తమకు అన్యాయమే జరుగుతున్నదని, అసలు తెలంగాణలో రిజర్వేషన్లు ఉన్నాయా? లేవా? అని ప్రశ్నించారు. మాదిగలను చట్టసభలకు దూరం పెడితే కాంగ్రెస్ భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. చాలామంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్‌రెడ్డిలా మాదిగలను దూరం పెట్టిన సీఎంను ఎన్నడూ చూడలేదని ధ్వజమెత్తారు. ఎవరో చెప్పిన మాటలు విని పార్టీకి అన్యాయం చేయొద్దని, రేవంత్‌రెడ్డి తప్పు సరిదిద్దుకోవాలని, ఈ విషయం తాను ఒక అన్నలా చెప్తున్నానని పేర్కొన్నారు. తనకు పార్టీ మారే ఆలోచన లేదని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయాలని కోరుకుంటున్నానని తెలిపారు. సీఎం తనకు సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి రెండు, మూడు టికెట్లు ఇచ్చి, మాదిగ జాతికి ఒక్క సీటు కూడా ఇవ్వరా? అని ప్రశ్నించారు.కాంగ్రెస్ నేత పిడమర్తి రవి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకు తక్కువ సీట్లు ఇచ్చారని, ఇప్పుడు కూడా ఇవ్వడం లేదని అన్నారు. టికెట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం జరుగుతున్నదని ధ్వజమెత్తారు. మందకృష్ణ మాదిగ వర్గీకరణ పేరుతో మాదిగలను బీజేపీ వైపు తీసుకెళ్తున్నాడని,కాంగ్రెస్ మాదిగలకు అన్యాయం చేస్తే బీజేపీకి లాభం చేకూరుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు తేడా కొడుతున్నదా?

మొదటిపేజీ తరువాయి...

ఇప్పుడెందుకు సానుభూతి రాగం ఎత్తుకున్నారు? ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో, రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చ ఇదే. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రేవంత్‌రెడ్డి పరపతిని తగ్గించాలంటే కొడంగల్‌లో మెజార్టీ తగ్గించాలి. లేదంటే రేవంత్‌రెడ్డిని దొంగ దెబ్బ తీయాలి. అందుకే వెనకాల గూడుపుఠాని చేస్తున్నరు. ఇది రేవంత్‌రెడ్డిని దెబ్బతీయటం కాదు.. కొడంగల్ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం. ఏదైనా తప్పిదం జరిగితే కొడంగల్‌కు వచ్చే సిమెంట్ ఫ్యాక్టరీ, రైల్వేలైన్, నారాయణపేట ఎత్తిపోతల ఆగిపోతది. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా రాకుండా పోతది. ఇన్ని నష్టాలు జరుగుతాయి. మన గౌరవాన్ని తగ్గించడానికి కుట్రలు జరుగుతున్నయ్. మనల్ని దెబ్బతీయడానికి పన్నాగాలు పన్నుతున్నారు' అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి తనను దెబ్బతీసేందుకు వెనక కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయని చెప్పటం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. అసలు ఈ వ్యాఖ్యలు ఎందుకు చేశారు? కారణమేంటి? దేనికి సంకేతం? అంటూ ఆరా తీస్తున్నారు.

వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకేనా?

రేవంత్‌రెడ్డి అంటేనే మాటల తూటాలు. ఏ పరిస్థితుల్లో అయినా సరే ప్రత్యర్థులపై తన మాటలతో ఎదురుదాడి చేస్తూ విరుచుకుపడుతారు. అది